క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరి

సత్యవేడు: మోటార్ సైక్లిస్టులు తప్పనిసరిగా శిరస్త్రాణం(హెల్మెట్) ధరించాలని ఎస్ఐ రామస్వామి అన్నారు. సోమవారం వాహనాల తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. బైక్ డ్రైవింగ్ చేసేటప్పుడు మోటారు వాహనాల చట్టం 1998లోని 129, 177 సెక్షన్ల ప్రకారం హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాల్లో చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని, దీనివల్ల కొన్ని కుటుంబాలు వీధిన పడుతున్నాయని చెప్పారు. ప్రమాదాల బారిన పడినా హెల్మెట్ రక్షణ కవచంగా ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

సత్యవేడు: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 8,9,10వ తరగతుల విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. సోమవారం దాగణం లలితమ్మ భాస్కరరావు, మెమోరియల్ ట్రస్ట్ (పెళ్లకూరు) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు రక్త గ్రూపులను తెలియజేశారు. ట్రస్టు సేవా కార్యక్రమాలను ఉపాధ్యాయులు అభినందించారు.

ముక్కంటి సేవలో దర్శకుడు పరశురామ్


ఆలయం వద్ద పరశురామ్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని సోమవారం ప్రముఖ సినీ దర్శకుడు పరశురామ్ దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలను చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయన్ని ఆశీర్వదించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా గొబ్బెమ్మ ఉత్సవం


పురవీధుల్లో ఊరేగుతున్న గొబ్బిదేవత

శ్రీకాళహస్తి: ధనుర్మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం విశేషాలంకరణ చేసి, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారిని చప్పరాలపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం: భూ సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని యానాదివెట్టులో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్థానికుల నుంచి పలు సమస్యలపై ఆయన వినతులు స్వీకరించారు. ప్రధానంగా ఉమ్మడి భూమికి సంబంధించి ఉన్న సమస్యలను పరిష్కారం చూపాలని కోరారు. పలువురు రేషన్ కార్డులకు, నూతన గృహాల మంజూరు కోసం విన్నవించారు. తహసీల్దార్ రాజశేఖర్, ఏఓ గౌరి, ఎస్ఐ మల్లికార్జున, సర్వేయర్ రమణ, ఆర్ఐ శివకుమార్,సర్పంచ్ సుజాతమ్మ, టీడీపీ నేతలు ము రళీనాయుడు, జయచంద్ర నాయుడు, పన్నెం నిర్మల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విజయవాడకు బస్సు

పాకాల : ప్రయాణికుల సౌకర్యార్థం బుధవారం నుంచి విజయవాడకు బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నట్లు పుంగనూరు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. సోమవారం ఆయన మట్లాడుతూ ఈ బస్సు బుధవారం సాయంత్రం 5.30కు పుంగనూరులో బయలుదేరి పాకాల మీదుగా తిరుపతికి రాత్రి 8.15కు చేరుకుంటుందన్నారు. తిరుపతి నుంచి రాత్రి 9కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు విజయవాడకు వెళుతుందన్నారు. మళ్లీ అదే రోజు రాత్రి 7.45కు విజయవాడలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.45 నిమి షాలకు పుంగనూరుకు వస్తుందన్నారు.

20న ఆలయ సందర్శనకు ప్రత్యేక బస్సు

తిరుపతి అర్బన్ : ఆలయాల సందర్శనకు ఈ నెల 20వ తేదీన ప్రత్యేక బస్సు నడపనున్నట్లు మంగళం డీఎం భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు తిరుపతి బస్టాండ్ నుంచి బయలు దేరుతుందని చెప్పారు. ప్రయాణికులు కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి ఆలయంతో పాటు నారాయణవనం, నాగలాపురం, సురుటుపల్లి ఆలయాలను సందర్శించుకునే వెసులుబాటు కల్పించినట్లు వెల్లడించారు.



బంగారు పతకాలు సాధించిన సత్యవేడు క్రీడాకారులు



పంచ్ విసిరితే పతకమే..!

కరాటేలో సత్తా చాటుతున్న సత్యవేడు క్రీడాకారులు

ఆ నలుగురికి మొదటి నుంచి కరాటే అంటే ఎంతో మక్కువ. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్ అయిన కరాటే మాస్టర్ భాస్కర్ శిక్షణలో నిత్యం సాధన చేయడం ప్రారంభించారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. తల్లిదండ్రులు, టీచర్ల ప్రోత్సాహంతో ముందుకు పోతున్నారు. తమిళనాడు, కర్ణాటక, ఏపీలలో ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొంటూ ప్రతిభ చాటి పతకాలు సాధిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.

బంగారు పతకమే లక్ష్యం



సత్యవేడు బాలుర ప్రభుత్వ పాఠశాలలో సెంద్రిల్లా 8వ తగరతి చదువుతున్నా. గతలోం మండల, జిల్లా స్థాయి కరాటే పోటీలలో రాణించాను. ఉదయం సాయంత్రం కరాటే సాధన చేస్తున్నా. క్రీడలతో నా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలనే లక్ష్యంతో ఉన్నా. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కరాటే మాస్టారు శిక్షణతో జాతీయ స్థాయిలో రాణించి మంచి పేరు తెచ్చుకుంటాను. - సెంద్రిల్లా, సత్యవేడు

సత్యవేడు: మండల కేంద్రానికి చెందిన కే.సెంద్రిల్లా, జీ.ధనుష్, కే.ధనుష్, ఈ. యోసఫ్ స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల చదువుతున్నారు. మొదటి నుంచీ వీరికి క్రీడలంటే ఆసక్తి ఎక్కువ. వీరు కరాటే శిక్షణ పొందుతున్నారు. 2021-22లో తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించిన కరాటే పోటీలలో 6 స్వర్ణ పతకాలు సాధించి రాష్ట్రానికి పేరుతెచ్చారు. ఇటీవలే కర్ణాటక రాష్ట్రంలో 2వ కరాటే స్పోర్ట్స్ కాంపిటీషన్ 2024-25 నిర్వహించారు. ఇండియన్ కౌన్సిల్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ గవర్నమెంట్ ఆఫ్ కర్ణాటక ఆధ్వర్యంలో మైసూరులోని దేవగౌడ సముదాయ భవనంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుంచి సుమారు 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కరాటే పోటీలలో కటా (విన్యాసాలు), కుమితే(ఫైటింగ్) విభాగాలలో ప్రతిభ చాటి 4 బంగారు పతకాలు సాధించారు. అండర్ 20 కరాటే కుమితేలో కే.ధనుష్, కటా విభాగంలో జీ.ధనుష్, కే.సెంద్రిల్లా, ఈ.యోసఫ్ బంగారు పతకాలు సాధించారు.

ఆర్మీ లేదా ఉద్యోగం సాధనే లక్ష్యం



ఆర్మీలో చేరాలనే లక్ష్యంతో ప్రాక్టీస్ చేస్తున్నాను. సత్యవేడులో డిగ్రీ పూర్తి చేశాను. తమిళనాడు రాష్ట్రస్థాయి పోటీలలో రాణించాను. అక్కడా గోల్డ్ మెడల్ సాధించా. కర్ణాటక రాష్ట్ర స్థాయి అండర్-20లో పాల్గొంటున్నా. కరాటేలో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం లేదా ఆర్మీలో చేరడం.. ఇదే నా లక్ష్యం. కే.ధనుష్, సత్యవేడు.

జాతీయ పోటీల్లో సత్తా చాటుతా



సత్యవేడులో ఇంటర్ చదువుతున్నా. రాష్ట్ర స్థాయి అండర్-18 కరాటే పోటీలో పాల్గొని బంగారు పతకం సాధించా. గత వారం కర్ణాటక రాష్ట్రంలోని మైసూరులో జరిగిన కరాటే కటా పోటీలో కూడా గోల్డ్ మెడల్ సాధించా. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటే దిశగా మాస్టర్ భాస్కర్ వద్ద శిక్షణ పొందుతున్నా. జీ.ధనుష్, సత్యవేడు.

పోలీస్ ఆఫీసర్ అవుతా



కరాటే అంటే నాకు ఇష్టం. 5వ తరగతి నుంచే కరాటే ఇష్టంగా నేర్చుకొంటున్నాను. భాస్కర్ మాస్టర్ వద్ద శిక్షణ పొందుతున్నా. బాగా చదివి పోలీస్ ఆఫీసర్ కావాలని కోరిక ఉంది. దీనికోసం కరాటేలో కూడా శిక్షణతో మంచి ఫిట్‌నెస్‌తో ఉంటాను. ఈ. యోసప్, సత్యవేడు.

ఆన్‌లైన్ మార్కెటింగ్ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

సత్యవేడు: స్వయం సహాయ సంఘాల సభ్యులు తయారు చేస్తున్న ఉత్పత్తుల అమ్మకాలకు ఆన్‌లైన్‌లో మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కో-ఆర్డినేటర్ శివకుమార్ కోరారు. సోమవారం సాయంత్రం స్థానిక శ్రీశక్తి భవన్‌లో గ్రామ సంఘాల సమావేశం నిర్వహించారు. సంఘాలు తొలుత వ్యాపార నిమిత్తం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాలు ఉత్పత్తి చేస్తున్న వస్తువుల బ్రాండ్, ఉత్పత్తి సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, లోగో ఉండాలన్నారు. ప్రధాన మంత్రి ఎంప్లాయ్‌మెంట్ రుణాల కోసం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 35 శాతం సబ్సిడీతో ఈపథకంలో రుణం మంజూరు చేస్తారన్నారు. మేకలు, గొర్రెలు, పాడి పశువుల కొనుగోలుకు బ్యాంకర్ల అంగీకారంతో రుణాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సీసీ పయని, మండల మహిళ సమైఖ్య అధ్యక్షురాలు కోటీశ్వరి, అకౌంటెంట్ కాంచన, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మృత్యుంజయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. గణపతిపూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూదితో అభిషేకాలు చేశారు. విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు.

పొన్నాలమ్మ ధనుర్మాస అభిషేకాలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్‌లో ఉన్న పొన్నాలమ్మ ఆలయంలో సోమవారం నుంచి ధనుర్మాసం పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేస్తారు. అందులో భాగంగా సోమవారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషాలంకరణ చేసి, ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఛైర్మన్ పుదూరు లక్ష్మణరెడ్డి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు

నారాయణవనం: గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు వెలశాయి. వీటిలో అధిక ధరలకు మద్యం అమ్మకాలు కొనసాగుతున్నా సంబధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులకు తోడు 24 గంటలపాటు సారా దొరకడంతో కూలీలు సంపాదన తాగుడుకే ఖర్చుపెడుతున్నారని మహిళలు వాపోతున్నారు. ప్రభుత్వం మద్యం షాపులకు రోజువారీ విక్రయాలకు టార్గెట్ విధించడంతో గ్రామాల్లో కూల్‌డ్రింక్ షాపుల్లో బహిరంగంగానే మద్యాన్ని క్వార్టర్‌పై రూ. 50 అదనంగా అమ్ముతున్నారు. బెల్ట్‌షాపులు, సారాను నియంత్రించాల్సిన ఎక్సైజ్, పోలీసు అధికారులు, సిబ్బంది నిమ్మకు నీరెత్తిన చందంగా ఉంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఎక్సైజ్ పోలీలకు సమాచారం అందించినా ఫలితం లేకపోగా అమ్మకాలు మరింత పెరిగాయని మహిళలు వాపోతున్నారు. అటవీ ప్రాంతంలో సారా తయారీ తిరిగీ ప్రారంభం కావడంతో యువత బలైపోతున్నారని పలువురు వాపోతున్నారు. ఇకనైనా ఎక్సైజ్, పోలీసు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామీణ మహిళలు కోరుతున్నారు.

సర్వదర్శనంలా అభిషేక దర్శనం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అభిషేక దర్శనాన్ని సర్వదర్శనంలా మార్చారు. సోమవారం ఆరుద్ర నక్షత్రం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. దీనికితోడు ధనుర్మాసం ప్రారంభం కావడంతో మొదటి రెండు అభిషేకాలు ఆలయం తరపునే నిర్వహిస్తారు. దీంతో 10 గంటలకు, సాయంత్రం 6గంటలకు నిర్వహించే అభిషేకాలకు అత్యధికంగా 280 టికెట్లు అమ్ముడు పోయినట్లు ఆలయాధికారులు తెలిపారు. రూ.1,500 టికెట్లు కొన్న భక్తులకు అభిషేకం ఒక సెకను కూడా చూడలేని పరిస్థితి ఏ ర్పడింది. ఉచిత దర్శనానికి పంపించినట్లుగా భక్తులను పంపి, సర్వదర్శనంలా మార్చారు. ఉదయం 10 గంటలకు 202 టికెట్లు విక్రయించారు. సాయంత్రం జరిగిన మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించారు. 84 మందికి టికెట్లు ఇచ్చారు. రోజుమొత్తం 286 టికెట్లను విక్రయించారు. ఒక టికెట్‌కు ఇద్దరు చొప్పున సుమారు 600 మంది వరకు అభిషేకానికి వచ్చారు. దీంతో రూ.1,500 పెట్టి అభిషేకం టికెట్లు కొని, స్వామివారి అభిషేకం కూడా చూడలేకపోయామని భక్తులు వాపోయారు. గతంలో అభిషేకానికి పరిమితంగా టికెట్లు ఇచ్చేవారు. ఆలయ ఆదాయం గతం కంటే ఎక్కువగా వచ్చిందని చూపించుకోవడానికి నూతన పాలకుల సూచనలతో ఇబ్బడి ముబ్బడిగా టికెట్లు విక్రయిస్తున్నారు. టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకునే పరిస్థితి లేదు. టికెట్ల ద్వారా సుమారు 60 మందికి మాత్రమే అభిషేకం చూసే అవకాశం ఉంటుంది. అయితే 600 మందిని అభిషేకానికి అనుమతివ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలంలో మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు ఆధార్‌క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 17న చేమూరు, 18న చియ్యవరం, 19న ఇలగనూరు, 20న పెద్దకన్నలిలో ఈ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ ఆధార్ క్యాంపుల్లో ఆధార్‌కార్డులు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చక్రేశ్వరస్వామికి పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మగుడివీధిలో వెలసిన చక్రేశ్వరస్వామికి ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామివారికి పలు అభిషేకాలు చేసి, విశేషాలంకరణ అనంతరం ధూప,దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇంధన పొదుపుతోనే భవిష్యత్తులో వెలుగులు

శ్రీకాళహస్తి: ఇంధన పొదుపుతో భవిష్యత్తులో వెలుగులు సాధ్యమని శ్రీకాళహస్తి ఆర్డీఓ భానుప్రకాష్ రెడ్డి అన్నారు. ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో ఇంధన పొదుపు వారోత్సవాలలతోపాటు అవగాహన ర్యాలీని ప్రారంభించారు. విద్యుత్ పొదుపుపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలన్నారు. ఈకార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నాగలాపురం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించిన ఘటన మండలంలోని కాలంజేరి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. కాలంజేరి గ్రామానికి చెందిన ఎం.మణికంఠన్(38) ఆదివారం రాత్రి 9.30 గంటలకు తన సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో నాగలాపురం టౌనుకు బయలుదేరాడు, తిరుగు ప్రయాణంలో నాగలాపురం నుంచి తన పక్క గ్రామమైన రామగిరికి చెందిన సీ.నాగరాజు(27)ను ఎక్కించుకుని పుత్తూరు-ఊత్తుకోట్టై జాతీయ రహదారిపై ఇంటికి బయల్దేరాడు. అదే సమయంలో చెన్నై వైపు వెళ్తున్న గుర్తుతెలియని లారీ ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇరువురినీ స్థానికులు 108 సాయంతో నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మణికంఠన్ మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. గాయపడిన నాగరాజును మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. నాగలాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. మణికంఠన్ మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.


మృతిచెందిన మణికంఠన్


గాయపడిన నాగరాజు

నేడు మండల సమావేశం

సత్యవేడు: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వి. ప్రతిమ అధ్యక్షతన మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు తగు సమాచారంతో రావాలని ఎంపీడీఓ కోరారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు


విశేషాలంకారంలో అయ్యప్పస్వామి

శ్రీకాళహస్తి: ధనుర్మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలో అయ్యప్పస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామివారి ఉత్సవమూర్తికి పలు రకాల అభిషేకాలు చేశారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అయ్యప్పస్వామికి ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ వెలుపల ఉన్న 16 కాళ్ల మండపంలో స్వామివారిని కొలువుదీర్చారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గ్యాస్ సిలిండర్ల నిల్వపై ఫిర్యాదు

నాగలాపురం: స్థానిక బజారు వీధికి చెందిన జె.శ్రీనివాసరావు జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశంలో అనుమతి లేకుండా భారత్, ఇండేన్ గ్యాస్ సిలిండర్లను నిల్వ చేసి విక్రయిస్తున్నాడని గ్రామస్తులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. శ్రీనివాసరావు తాను కాపురం ఉంటున్న బజారువీధిలోని ఇంటి కింద ఉన్న గోడౌనులో, ఇంటి బయట ఆటోలో ఎలాంటి భద్రత చర్యలు లేకుండా అక్రమంగా ఫుల్ గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచి విక్రయిస్తున్నాడు. జనావాసాల మధ్య ఇది ప్రమాదకరమని స్థానికులు హెచ్చరించినా పట్టించుకోకపోవడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ సునీల్ కుమార్ ఆ గోడౌన్‌ను పరిశీలించి మూసివేశారు. సిలిండర్ల అమ్మకాలకు లైసెన్సు లేనిపక్షంలో అతడిపై కేసు నమోదు చేస్తామని చెప్పారు.


బజారు వీధిలో ఇంటి ముందు ఆటోలో నిల్వ ఉన్న ఫుల్ గ్యాస్ సిలిండర్లు

అంబికాపురం కాజ్‌వేకు మరమ్మతులు చేయరూ!

వరదయ్యపాళెం: మండలంలోని అంబికాపురం సమీపంలో వెళ్లే రాళ్లవాగు కాజ్‌వేకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాజ్‌వేకు రెండువైపులా రోడ్డు ధ్వంసమైంది. దీంతో ఆ ప్రాంతంలో ప్రస్తుతం రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ మార్గంలో అంబికాపురం, తొండంబట్టు, ఎంజీనగర్ గ్రామస్తులు రాకపోకలను అవస్థలు పడుతున్నారు. దీనిపై అధికారులకు విన్నవించినా స్పందన లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి కాజ్‌వేకు మరమ్మతులు చేసి రాకపోకల పునరుద్ధరణకు మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు.


అంబికాపురం సమీపంలో ధ్వంసమైన రాళ్లవాగు కాజ్‌వే

పెద్ద పాండూరు-తొండంబట్టు రోడ్డు ధ్వంసం

- వరద బీభత్సానికి 200 మీటర్ల మేరకు దెబ్బతిన్న బీటీ రోడ్డు
- ఏడాదిగా రహదారి మరమ్మతులు చేయని వైనం

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరు నుంచి తొండంబట్టు మీదుగా సిద్దాపురం వరకు వేసిన బీటీ రోడ్డు గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమైంది. పెద్ద పాండూరు రాళ్లకాలువ లోలెవల్ కాజ్‌వే నుం,ఇ కుప్పట తాగేలి సమీపం వరకు 200 మీటర్లు పూర్తిగా ధ్వంసమైంది. తారురోడ్డు కాస్త మెటల్ రోడ్డుగా మారిపోయింది. ఎన్నో ఏళ్లగా ఈ మార్గానికి తారురోడ్డు లేక ఆ ప్రాంత ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సుమారు 10 గ్రామాల ప్రజలు ఆ ప్రాంత రోడ్డు నిర్మాణం కోసం అప్పటి స్థానిక ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో పంచాయతీరాజ్ ద్వారా బీటీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ఎమ్మెల్యే నివేదించారు. తక్షణమే ఈ మార్గంలో 5.5 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3.75కోట్లు నిధులు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసి రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే చేతుల మీదుగా రోడ్డును ప్రారంభించి ఆ ప్రాంత ప్రజల రాకపోకలు సుగమం చేశారు. అయితే వర్షాలకు రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో మళ్లీ ఆ ప్రాంత ప్రజల వాహన రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితులు పునరావృతమయ్యాయి. రోడ్డుకు ఓవైపు రాళ్లవాగు ఏరు ప్రవహిస్తుండడంతో భారీ వర్షాలకు రోడ్డుపైకి వరదనీరు పొర్లి రోడ్డు అవతలివైపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డుపై ఉన్న తారు లేయర్ పూర్తిగా కొట్టుకుపోయింది. ప్రస్తుతం ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు మరింత ధ్వంసమై రాకపోకలకు మరింత ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం స్పందించి వరద నష్టం కింద నిధులు మంజూరు చేసి తక్షణమే రోడ్డు వేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.


వర్షాలకు ధ్వంసమైన పెద్ద పాండూరు-తొండంబట్టు రోడ్డు


వర్షాలకు కోతకు గురైన తారు రోడ్డు

ఏఓగా గౌరి బాధ్యతల స్వీకరణ



వరదయ్యపాళెం: మండల వ్యవసాయశాఖ అధికారిగా గౌరి బాధ్యతలు స్వీకరించారు. ఆమె అనంతపురం జిల్లా నుంచి బదిలీపై రాగా ఇక్కడ పనిచేస్తున్న ఏఓ ద్వారకానాథ్ సత్యవేడు ల్యాబ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన వ్యవసాయశాఖ అధికారి గౌరి మాట్లాడుతూ మండలంలోని రైతుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని, అలాగే వర్షాలకు దెబ్బతిన్న పంట నష్టం అంచనాలు సిద్ధం చేసి, 1200 ఎకరాల పంట నీట మునిగినట్లు కలెక్టర్‌కు నివేదించినట్లు ఆమె వివరించారు.